క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉండవెల్లి: మండలంలోని తక్కశీల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను ఎంపీడీఓ తిరుపతన్న పరిశీలించారు. కూలీల హాజరుశాతాన్ని తనిఖీ చేసి కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, మేట్లు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని లింగన్వాయి గ్రామంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను సోమవారం ఎంపీడీఓ పద్మావతి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో చేపట్టాలి

మానవపాడు: గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల మధ్య రోడ్డు వేయొద్దు

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని ర్యాలంపాడ్ శివారులోని పొలాల మధ్యలో రోడ్డు వేస్తుండగా సంబంధిత రైతులు పొలాల్లో రోడ్డు వేయొద్దని అభ్యంతరాలు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎంపీడీఓ పద్మావతి సర్వేయర్‌తో సర్వే చేయించారు. రైతుల పొల్లాల్లో వెళ్లకుండా హద్దులు గీసి రోడ్డును వేసేలా ఎంపీడీఓ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్‌నాయుడు రైతులు పాల్గొన్నారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్: రోజు రోజుకు ముదురుతున్న ఎండలంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం అధ్యక్షుడు మొహమ్మద్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ మంజుల ఆధ్వర్యంలో సోమవారం వడదెబ్బపై కళాజాత బృంద సభ్యులు అవగాహన కల్పించారు. వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాకారులు రమాదేవి, కవిత, హజరత్, కేశవులు, స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గట్టు: ఎస్సీ రైతుల జీవనోపాధి కోసం బోర్‌వెల్ తవ్వకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ గద్వాల, భూగర్భ జల శాఖ ఎస్‌సీఎస్‌డీఎఫ్ పథకం ద్వారా ఎస్సీ రైతుల జీవనోపాధుల కోసం బోర్ తవ్వకానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలానికి 22 బోర్లు తవ్వకానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఎస్సీ రైతుల నుంచి మాత్రమే దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలి

గద్వాలన్యూటౌన్: బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ, సంక్షేమంపై ఎంసీపీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సంబంధిత శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు సహకారంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చ్యలు తీసుకోవాలన్నారు. డీసీపీఓ నర్సింహా మాట్లాడుతూ.. బాలలపై శారీరక, మానసిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణకు 1098 సమాచారం అందించాలని కోరారు. అనంతరం బాలల పరిరక్షణపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ చంద్రకళ, సురేష్, ఏఎస్ఐ వెంకటేష్‌గౌడ్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు మరమ్మతులేవి?



చెన్నిపాడు శివారు ప్రాంతంలో ముళ్లపొదలతో నిండిన డీ-30 కాలువ

- చెట్లు, మట్టితో పేరుకుపోయిన ఛైనం
- ఆయకట్టు చివరి వరకు అందని నీరు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నీరు తక్కువగా ప్రవహిస్తున్న డీ-30 కాలువ

మానవపాడు: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్డీఎస్ కాలువల మరమ్మతుకు రూ.11కోట్ల నిధులు కేటాయించారు. కాంట్రాకర్, అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టు చివరి వరకు కాలువలో పూడికతీత, ముళ్లపొదల తొలగింపు తదితర పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలకు, ఉండవెల్లి మండలంలోని గ్రామాలకు కాలువ ద్వారా ఆయకట్టు చివరి వరకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ మట్టి, ముళ్లకంపలు, చెత్తా, చెదారాలతో నిండిపోవడంతో నీరు అందడం లేదని వాపోతున్నారు. పూడిక తీయకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో పంట పొలాల్లో నీరుచేరి గండి పడుతున్నట్లు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కాలువల మరమ్మతులకు మంజూరైన నిధులు దారి మల్లాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వేల ఎకరాల్లో సాగు..

ఆర్డీఎస్ కాలువల కింద మిర్చి, కంది, మొక్కజొన్న, జొన్న, పంటలు డీ-29, డీ-30 కాలువల కింది వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కాలువకు మరమ్మతులు చేయకపోవడం వల్ల నీరందడం లేదంటున్నారు. బోర్ల ద్వారా అరకొర నీటి వసతితో సరైన దిగుబడి రావడం లేదని పేర్కొన్నారు. కిందిస్థాయి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలంటే కాలువకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులు కోరుతున్నారు. అధికారులు ఆర్డీఎస్ కాలువల్లో మరమ్మతులు చేపట్టకపోవడంతో పంటలు కాపాడుకునేందుకు సొంత ఖర్చులతో కొద్ది మొత్తంలో పూడిక తీయించుకుని పంటలకు తడులు అందిస్తున్నా.. సరిగా తడులు అందించలేక పోతున్నామని వాపోతున్నారు.

మరమ్మతు చేపట్టాలి..



మండలంలోని ఆర్డీఎస్-30 కాలువలకు కిందిస్థాయి వరకు నీరందడం లేదు. అధికారులు రెండేళ్ల క్రితం మానవపాడు శివారు వరకు మాత్రమే పూడికతీత పనులు తూతూ మంత్రంగా చేపట్టారు. నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్లు వ్యవహరించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడికతీత పనులను చేపట్టాలి.

– రంగస్వామి రైతు చెన్నిపాడు

అధికారులు పట్టించుకోవడం లేదు..



మానవపాడు మండలంలోని చాలా గ్రామాలకు డీ- 29 కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. కాలువల్లో మట్టి పేరుకపోయి పూర్తి స్థాయిలో నీరందడం లేదు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– గోపాల్, గోకులపాడు

కిందిస్థాయికి నీరు అందడం లేదు



ఆర్డీఎస్ కాలువలకు చివరి ఆయకట్టు వరకు ఉన్న మట్టి, ముళ్లపొదలు తొలగించాలి. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైన తూతూ మంత్రంగానే అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. పంటలకు నీటి తడులు సరిగా అందక దిగుబడి రావడం లేదు. అధికారులు చొరవ చూపి కాలువల్లో మరమ్మతు చేపట్టాలి.

–మద్దిలేటి, ఉండవెల్లి

జాబ్‌కార్డు దారులందరికీ పని కల్పించాలి



పెద్దపల్లిలో ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్: జాబ్‌కార్డు ఉన్న కూలీలందరికీ ఉపాధి కల్పించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సోమవారం పెద్దపల్లి, పావనంపల్లి, మల్దకల్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు సకాలంలో డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి గ్రామంలో వంద మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి కల్పించాలన్నారు. జాబుకార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే జాబు కార్డు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

28న ప్రభుత్వం తరఫున ఇఫ్తార్



అలంపూర్: రంజాన్ పండగను పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున ఈనెల 28న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ మంజుల తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అలంపూర్, మానవపాడు, రాజోళి, అయిజ మండలాల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం కమిటీ నాయకులు

అయిజ: కోనోకార్పస్ మొక్కలు వెంటనే తొలగించాలని అఖిలపక్షం కమిటీ నాయకులు కోరారు. సోమవారం మున్సిపాలిటీ పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ సైదులుకు పట్టణ ప్రజలు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో రోడ్ల పక్కన విరివిగా నాటిన కోనోకార్పస్ మొక్కల నుంచి వచ్చే వాయువు ప్రమాదకరంగా ఉంటుందన్నారు. ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా వంటి వ్యాధులు వస్తాయని పర్యవరణవేత్తలు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే వాటిని తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటరాములు, హనుమంతు, విష్ణువర్దన్ రెడ్డి, వీరశేఖర్, శేఖర్ శెట్టిచ చరణ్ రెడ్డి, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను కూలీలుగా మార్చకండి



రాజోళి: మీ పిల్లలను కూడా కూలీలుగా మార్చవద్దని చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం మండలంలోని చిన్నధన్వాడ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో పిల్లలు విద్యా వంతులుగా మార్చాలన్నారు. విద్య ప్రాముఖ్యత తెలుసుకుని పిల్లలను తప్పక బడికి పంపాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఒరిగిందేమి లేదు



మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు జయలక్ష్మి

శాంతినగర్: కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు జయలక్ష్మి అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో బీజేపీ అధ్యక్షుడు మండలాధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు, రైతులు నమ్మడం లేదన్నారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను చూస్తూ బాధేస్తుందన్నారు. అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆస్పత్రికి డాక్టర్లను నియమించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అలంపూర్ నియోజకవర్గ ప్రజలు వైద్య సౌకర్యం అందుబాటులో లేకపోవడంవల్ల ప్రమాదాలు జరిగి, అనారోగ్యాల వల్ల చాలా మంది మృత్యువాత పడుతున్నా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు పట్టడంలేదన్నారు. నియోజకవర్గ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అయ్యరాజు, బూత్ అధ్యక్షుడు రంగస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు



రాజోళి: టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఉత్తమ సేవలకు టీబీ సూపర్‌వైజర్ జయప్రకాష్‌కు ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రం అందజేసినట్లు జిల్లా వైద్యశాఖ అధికారి సిద్దప్ప అన్నారు. టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం అవార్డు అందజేశారు. రాజోళి పీహెచ్‌సీ తరఫున క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, రోగులకు సకాలంలో మందులు అందించడం, వారికి నిర్ణీత మందులను వాడటంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మధుబాబు, రంజిత్‌కుమార్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై సర్వే



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: మండల కేంద్రంతో పాటు కొత్త రాజోళిలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై రెండు రోజులుగా సర్వే నిర్వహించినట్లు పార్టీ మండల కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు. స్థానికంగా డ్రైనేజీ సమస్యలు వేధిస్తున్నాయని, కాల్వల్లో మురుగు తీయకపోవడం వల్ల దుర్గంధం వస్తుందన్నారు. కొత్త రాజోళిలో ఇళ్ల మధ్యలో పెరిగిన ముళ్లకంపలను అధికారులు తొలగించకపోవడం వల్ల విషసర్పాలతో పాటు, కొండ చిలువలు తిరుగుతున్నాయన్నారు. శాంతిగనర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. తదితర సమస్యలతో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మన్న, కృష్ణ, నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు మధు, రాజు తదిదరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల అరెస్టు

ఇటిక్యాల: చలో కమిషనరేట్ ముట్టడిలో భాగంగా ఆశా కార్యకర్తలు తరలివెళ్తున్నా సమాచారంతో ఎస్ఐ వెంకటేష్ ఎర్రవల్లిలో వివిధ మండలాలకు చెందిన 26 మంది ఆశా కార్యకర్తలను బైండోవర్ చేసి ఠాణాకు తరలించారు. అరెస్ట్ అయిన ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నర్సమ్మ, సుజాత, భారతి, సుధారాణి, అనిత, శంకరమ్మ, మేరమ్మ, వసంత, జ్యోతి పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి

అయిజ: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అయిజ పట్టణానికి వచ్చిన భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ.. మల్లు రవిని ఎంపీగా గెలిపిస్తే అయిజ పట్టణానికి విద్యాసంస్థలు, వసతి గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ దిశగా భట్టి విక్రమార్క, మల్లురవి కానీ, ప్రభుత్వం కానీ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. పట్టణంలో బాలుర, బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ (కళాశాల వసతి గృహాలు) ఏర్పాటు చేస్తే సుమారు వెయ్యి మంది కళాశాల విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల తరఫున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమసేన రావు, గోపాల కృష్ణ, వెంకటేష్, ప్రదీప్‌కుమార్, నాగరాజు, రఘు, లక్ష్మణ్ ఆచారి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: గ్రామాల్లోని నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.రాజు కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని సోమవారం టైపిస్టు చంద్రావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఊట్కూరు గ్రామంలో మిషన్ భగీరథ నుంచి కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భీమవరం గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేలో అర్హతలేని వారిని ఎంపిక చేసినట్లు, ఉపాధి కూలీలకు తక్షణమే కూలి డబ్బులు చెల్లించాలన్నారు. కొత్తగా వివాహాలు చేసుకున్న వారికి రేషన్ కార్డులు, జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. పని చేసే ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉంటే వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నాయకులు నరసింహ్మ, కేవీపీఎ పట్టణ అధ్యక్షుడు అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

గద్వాలటౌన్: కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్-2047లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అంశంపై ఇటీవల ఉపన్యాస పోటీలు నిర్వహించింది. మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించగా, అందులో ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. కళాశాలకు చెందిన విద్యార్థులు పావని, కళావతి, షామిలి, తిరుమలేష్ ఉమ్మడి జిల్లా కళాశాలల పోటీల్లో ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు

మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామంలో చింతలామునిస్వామి, నల్లారెడ్డిస్వామి వార్ల రథోత్సవం సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను భాజాభజంత్రీలతో వేదపండితులు రథంపై ఉంచి ఆలయం నుంచి గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయం వరకు ఊరేగించారు. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, విక్రంసింహారెడ్డి, సత్యానారాయణ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మన్న, నల్లన్న, పూజారులు పెద్దనల్లన్న, చిన్ననల్లన్న, పాండురంగయ్య, ప్రభాకర్, రంగస్వామి, నల్లన్నలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



ఎర్రవల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఇటిక్యాలలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఉండవెల్లి/అలంపూర్/ఇటిక్యాల/ఎర్రవల్లి/మానవపాడు: ఉండవెల్లి మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 407 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంఈఓ అశోక్ తెలిపారు.

⇨ అలంపూర్ పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 305 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు.

⇨ ఇటిక్యాల మండల కేంద్రంలో పదో పబ్లిక్ పరీక్షకు వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

⇨ఎర్రవల్లి మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 409 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి అమీర్‌పాషా తెలిపారు. కోదండాపురంలో 126, కొండేరులో 146, ఎర్రవల్లిలో 136 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

⇨ మానవపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు 296 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

క్షయ నివారణకు కృషి చేద్దాం



గట్టులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇటిక్యాల: క్షయరహిత దేశంగా మార్చడానికి వ్యాధిపై అందరికీ అవగాహన ఉండాలని డాక్టర్ ముబీనా తబుసుమ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ. క్షయవ్యాధి ఎక్కువగా పొగ, మందు తాగే వాళ్లో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు ఉన్నప్పుడు కఫం ద్వారా రక్తపు జీరలు పడటం, బరువు తగ్గుట లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఉమ్మడి మండలంలో వ్యాధిగ్రస్తులను 143 మందిని గుర్తించి సిబ్బంది పర్యవేక్షణలో ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుపర్‌వైజర్ శేఖర్, వెంకటేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

గట్టు: క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలిద్దామని, దీనికి అందరి సహకారం అవసరమని వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. సోమవారం భవిష్య భారత్, ఎల్‌టీబీమైండ్‌ట్రీ సహకారంతో గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శకుంతలమ్మ, జీవనోపాధుల అధికారి వెంకటేశ్వర్లు, హరి, ప్రోగ్రామ్ సపోర్టు ఆఫీసర్ మునిస్వామి, నాగరాజు, రాగిణి, పార్వతి, సీఓ హాలీంపాష, వినోద్, పరమేష్, వాల్మీకి, లక్ష్మన్న, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.